క్లుప్తంగా

గెలుపు ఓటములను సమానంగా భావించాలి

ఎమ్మెల్యే కోన రఘుపతి

కర్లపాలెం: క్రీడాకారులు పోరాట పటిమ కలిగి ఉండటంతో పాటు గెలుపు ఓటములను సమానంగా భావించాలని ఎమ్మెల్యే కోన రఘుపతి తెలిపారు. బాపట్ల జిల్లా కర్లపాలెం మండలంలోని చింతాయపాలెం హైస్కూల్‌లో బుధవారం జరిగిన రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నల్లూరి రాజ గోపాలరావు మెమోరియల్ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ శాప్‌లీగ్ పోటీలకు ఎమ్మెల్యే కోన రఘుపతి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కోన మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించాలన్నారు. తను చదువుకునే రోజులలో క్రికెట్, బేస్‌బాల్ ఆడే వాడినని క్రీడలంటే చాలా ఇష్టమని తెలిపారు. రాష్ట్రస్థాయిలో జరుగుతున్న హ్యాండ్‌బాల్ పోటీలను సక్రమంగా నిర్వహించాలని చెప్పారు. రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ కార్యదర్శి బి.నాగరాజు మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో జరుగుతున్న హ్యాండ్‌బాల్ పోటీల్లో మొత్తం 13 ఉమ్మడి జిల్లాల నుంచి 150మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని పోటీలు గురువారం ముగుస్తాయని తెలిపారు. గ్రామ సర్పంచి కాటూరి శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యుడు రాతంశెట్టి లక్ష్మణరావు, వైఎస్సార్ సీపీ కర్లపాలెం మండల అధ్యక్షుడు దొంతిబోయిన సీతారామిరెడ్డి, చింతాయపాలెం సొసైటీ అధ్యక్షుడు మరకా పెదవెంకటేశ్వర్లు, యల్లావుల ఏడుకొండలు, హ్యాండ్‌బాల్ జిల్లా కార్యదర్శి పాల్‌కుమార్, క్రీడాకారులు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

దుండి పాలెం(వేమూరు): అల్లుడు చేతిలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందిన ఘటన బుధవారం జరిగింది. చుండూరు ఎస్‌ఐ నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం దుండి పాలెం గ్రామానికి చెందిన కుంచెల బ్రహ్మారెడ్డి(35) ఆటో నడుపుతూ జీవనం కొనసాగిస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన ప్రశాంత రెడ్డి బ్రహ్మారెడ్డి కుమార్తెను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. దీంతో బ్రహ్మారెడ్డి, ప్రశాంత రెడ్డిలమధ్య గొడవలు నెలకొన్నాయి. ఈక్రమంలో డిసెంబరు 31 తేదీ రాత్రి 10 గంటల సమయంలో బ్రహ్మారెడ్డి దుండి పాలెం గ్రామంలో ఆటోతో ఇంటికి వెళ్లుతున్నాడు. అల్లుడు ప్రశాంత రెడ్డి మద్యం సేవించి బ్రహ్మారెడ్డిని అడ్డుకొని గొడవ పడ్డాడు. దీంతో ఇద్దరి మధ్య గొడవ తీవ్రస్థాయికి చేరింది. తన చేతిలో ఉన్న ఇనుప రాడ్‌తో ప్రశాంత్‌రెడ్డి బ్రహ్మారెడ్డి పొట్టలో పొడిచాడు. దీంతో బ్రహ్మారెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. గ్రామస్తులు 108 వాహనంలో తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి సీరియస్‌గా ఉండటంతో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈక్రమంలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందినట్లు ఎస్‌ఐ నవీన్ కుమార్ తెలిపారు. నిందితుడు ప్రశాంత రెడ్డిని అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా తెనాలి సబ్‌జైలులో రిమాండ్‌లో ఉన్నట్లు తెలిపారు.

పిండిమర యూనిట్ కింద రూ. 2లక్షల చెక్కు పంపిణీ

భట్టిప్రోలు: బాపట్ల స్పందన హాల్‌లో బుధవారం జరిగిన బడుగు వికాసం, పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ గ్రౌండింగ్ మేళాలో బాపట్ల జిల్లాలోని భట్టిప్రోలు మండలం ఆళ్లమూడికి చెందిన మహిళ పొట్లూరి రాజ్యలక్ష్మి, జిల్లా కలెక్టర్ కె.విజయ కృష్ణన్‌తో ఇంట్రాక్ట్ అయ్యారు. పీఎంఎఫ్ఎంఈ పథకం కింద పిండిమర యూనిట్‌కు సంబంధించి రూ.2లక్షల చెక్కును జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, శాసనమండలి సభ్యుడు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు చేతుల మీదుగా అందుకున్నట్లు మండల సమాఖ్య ప్రాజెక్ట్ మేనేజర్ కొండూరు శోభన్ తెలిపారు.

వాడీవేడిగా మండల పరిషత్ సమావేశం

భట్టిప్రోలు: మండల కేంద్రమైన భట్టిప్రోలులో వైద్యులు పత్తా లేకపోవడంపై ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ లలిత కుమారి మాట్లాడుతూ మూడు నెలలకు ఒకసారి నిర్వహించే సమావేశానికి వైద్యాధికారిణి రాకపోవడానికి కారణమేమిటని సీహెచ్‌ఓ డి. మాతయ్యను ప్రశ్నించారు. వైద్యురాలు డీఎల్ పద్మజ మెడికల్ లీవ్‌లో ఉన్నారని బదులిచ్చారు. పీహెచ్‌సీలో ఇరువురు వైద్యులు ఉంటే కనీసం ఒక్కరైనా రావాల్సిన అవసరం ఉందని, ఎన్నిసార్లు చెప్పినా ధోరణి మారడం లేదన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, కో–ఆప్షన్ సభ్యుడు షేక్ సలీమ్ మాట్లాడారు. సమావేశంలో ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖరరావు, వైస్ ఎంపీపీలు కొతరపు పిచ్చయ్యశాస్త్రి, మల్లోలు ఉషారాణి, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే గడప గడపకు..

- మంత్రి మేరుగ నాగార్జున
- యలవర్రులో గడప గడపకు మన ప్రభుత్వం

యలవర్రు(వేమూరు): గ్రామాల్లో ప్రజా సమస్యలు పరిష్కరించడానికి ప్రజలకు మరింతగా మేలు చేయడానికి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తునట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగ నాగార్జున పేర్కొన్నారు. అమర్తలూరు మండలంలోని యలవర్రులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. గ్రామంలో రూ.25 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని మంత్రి మేరుగ నాగార్జున ప్రారంభించారు. మంత్రి ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అమలు తీరు గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామంలోని సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో అంతర్గత రోడ్లువేసే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లులా పాలనను సాగిస్తున్నారని, అందరూ మరోసారి ఆశీర్వదించాలని కోరారు. గత ప్రభుత్వాలు సంక్షేమం, అభివృద్ధి గురించి ఏనాడూ పట్టించు కోలేదని ఎద్దేవా చేశారు. గ్రామ సర్పంచి మండే నాగేశ్వరరావు, ఎంపీపీ రాపర్ల నరేంద్ర, జడ్పీటీసీ మూల్పూరు లావణ్య, యలవర్తి సురేష్, సాహిత్య అకాడమీ డైరెక్టరు ఓలేటి శివాజీ ఎంపీటీసీ మానుకొండ ఝాన్సీ రాణి, మానుకొండ నాయుడమ్మ, ఇంటూరు బాబురావు, కొండసీమ జయంతి రావు, తమలపాకు భీమయ్య, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



మహిళకు సంక్షేమ పథకాల బ్యాలెట్ అందజేసి, సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి మేరుగ నాగార్జున

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల అర్బన్: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం అని ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా బుధవారం బాపట్ల మండలం పరిధిలోని బసిరెడ్డిపాలెం, హనుమాన్ నగర్ గ్రామాల్లో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి ఆప్యాయంగా ప్రకటించారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా అని ఆరా తీశారు. ఇప్పటివరకు ప్రభుత్వం ద్వారా పొందిన లబ్ధిని వివరిస్తూ సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేశారు. గ్రామంలో తాగు నీటి ఎద్దడి తొలగిస్తామని, సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు వచ్చే మార్చి నాటికి పూర్తి చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. పార్టీలకతీతంగా ప్రభుత్వ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని కోరారు. అంతకుముందు గ్రామ సచివాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి, ఎంపీపీ చిన్న పోతుల హరిబాబు, వడ్డీముక్కల డేవిడ్, అధికారులు సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.



సంక్షేమ కరపత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక సంక్రాంతి

బాపట్ల అర్బన్: సంస్కృతి..సాంప్రదాయాలకు ప్రతీకే సంక్రాంతి పండుగని మోదుగుల శ్రీరామిరెడ్డి డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ మోదుగుల బసవపున్నారెడ్డి తెలిపారు. స్థానిక డిగ్రీ కళాశాలలో బుధవారం సంక్రాంతి పండుగను నిర్వహించారు. ఈ సందర్భంగా మోదుగుల బసవపున్నారెడ్డి మాట్లాడుతూ సంక్రాంతి పండుగ అందరి జీవితాల్లో నూతన మార్పుతీసుకురావాలన్నారు. రైతులు, కార్మికులు, ఉద్యోగులు, విద్యార్థులు అంతా కలిసి పండుగను ఐక్యంగా జరుపుకోవాలన్నారు. డిగ్రీ కళాశాల, డీఎడ్ కళాశాలల విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. రాధిక, ప్రిన్సిపాల్ పి.శేఖర్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్ కోటిరెడ్డి, నర్సింగ్ కళాశాల ఏఓ కె.పెరుమళయ్య, శంకర్‌రెడ్డి, డేగల రవిరెడ్డి, మస్తాన్‌బేగ్ తదితరులు పాల్గొన్నారు. ముగ్గుల పోటీలలో విజేతలకు బహుమతులు అందించారు.

పెనుమూడిలో..

రేపల్లెరూరల్: తెలుగింటి సాంప్రదాయాలను భవిష్యతరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పెనుమూడి సర్పంచి దారం విజయ్‌రాజు అన్నారు. మండలంలోని పెనుమూడి ప్రాథమిక పాఠశాలలో బుధవారం నిర్వహించిన సంక్రాంతి సంబరాలను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలు, ముగ్గులు పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అదేవిధంగా పాఠశాల ఆవరణంలో బోగి మంటలు వేశారు. హెచ్‌ఎం సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



అడవులదీవి జెడ్పీహైస్కూల్లో విద్యార్థినులు వేసిన రంగవల్లులు



విద్యార్థులకు బోగిపండ్లు పోస్తున్న సర్పంచి విజయ్‌రాజు, ఉపాధ్యాయులు

అడవులదీవి జెడ్పీహైస్కూల్లో..

నిజాంపట్నం: మండలంలోని అడవులదీవి జెడ్పీహైస్కూల్లో బుధవారం సంక్రాంతి సంబరాలను నిర్వహించారు. విద్యార్థినుల ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతిని మేఘన, నాగశ్రీవల్లి గెలుపొందారు. అదేవిదంగా ద్వితీయ బహుమతిని సహస్ర, వైష్ణవి గెలుపొందగా, తృతీయ బహుమతిని రక్షిత, నూకాంబిక గెలుపొందారు. హెచ్‌ఎం మాచర్ల మోహన్‌రావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పండక్కి విందు భోజనం వాల్తేరు వీరయ్య

- సీఎం వైఎస్ జగన్‌కు ప్రత్యేక ధన్యవాదాలు
- దేశవ్యాప్తంగా తెలుగు సినిమా ఘనకీర్తి చాటుతుంది
- సినీ రచయిత కోన వెంకట్

సాక్షిప్రతినిధి, బాపట్ల: ఈనెల 13న విడుదల కానున్న మెగాస్టార్ చిరంజీవి నటించిన వాల్తేరు వీరయ్య సినిమా అభిమానులకు పండుగ భోజనం లాంటిదని సినీ రచయిత కోన వెంకట్ అన్నారు. జిల్లా కేంద్రం బాపట్ల పట్టణంలోని గౌతమిగ్రాండ్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకొని విడుదల కానున్న సినిమాల టిక్కెట్ ధరలను పెంచుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక అనుమతి ఇవ్వడంపై కోన వెంకట్ హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సినీ పరిశ్రమ తరపున సీఎంకు ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. రాజమౌళి ఇండియాలో బిగ్గెస్ట్ కలక్షన్స్ సినిమాలు తీశారన్నారు. వీటికి ప్రధానమంత్రి స్థాయిలో అభినందనలు వచ్చాయన్నారు. తెలుగుసినిమా ఈ స్థాయికి వెళ్తుందని కలలో కూడా ఊహించలేదన్నారు. తెలుగు రైటర్లు, నిర్మాతలు గర్వించదగ్గ విషయమన్నారు. పుష్ప, ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలు పాన్‌ఇండియా స్థాయిలో విజయవంతం అయ్యాయన్నారు. దీంతో తెలుగు సినిమాలకు, కంటెంట్‌కు డిమాండ్ పెరిగిందన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సినీ రచయిత కోన వెంకట్

వైభవంగా సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తాం

- ఫుడ్‌సైన్సు కళాశాల ఎదురు ఏబీఎం గ్రౌండ్స్‌లో కార్యక్రమాలు
- ఎమ్మెల్యే కోన రఘుపతి

బాపట్ల: తెలుగు సంస్కృతీ, సంప్రదాయాల మేళవింపుతో అంగరంగ వైభవంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించేందుకు కోన చారిటబుల్ ట్రస్టు సిద్ధమవుతుందని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి పేర్కొన్నారు. 21ఏళ్లుగా నిర్వహించే ఈ సంబరాలకు ఫుడ్‌సైన్సు కళాశాల ఎదురు ఏబీఎం కాంపౌండ్‌ను వేదిక చేస్తునట్లు తెలిపారు. బుధవారం స్థానిక కోన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంక్రాంతి సంబరాల కరపత్రాలను విడుదల చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే కోన రఘుపతి మాట్లాడుతూ 21ఏళ్లుగా సంక్రాంతి సంబరాలు, క్రిస్మస్ వేడుకలు, రంజాన్‌ పండుగులను ప్రత్యేకంగా నిర్వహిస్తునట్లు తెలిపారు.

14వతేదీన ప్రత్యేక సంగీత విభావరి

సంక్రాంతి సంబరాల్లో భాగంగా 14వతేదీన స్థానిక భావన్నారాయణస్వామి దేవస్థానంలో ధాన్య లక్ష్మీ పూజతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తునట్లు కోన తెలిపారు. స్థానిక ఫుడ్‌సైన్సు కళాశాల ఎదురు ఉన్న ఏబీఎం కాంపౌండ్ స్థలంలో మెగా మ్యూజికల్ నైట్ నిర్వహిస్తునట్లు తెలిపారు. సినీ గాయకులు సింహ, యశస్వి, జయంత్, శ్రీరామచంద్ర, అదితి భావరాజు, హారిక నారాయణన్, కీర్తనశర్మ, మనీషా యర్రబాతినచే సంగీత విభావరి ఉంటుందని తెలిపారు. జబర్‌దస్త్ టీమ్‌లోని చమ్మక్ చంద్ర అండ్ టీమ్ ప్రత్యేక కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంతోపాటు పశుప్రదర్శన, గంగిరెద్దులు, సాంస్కృతిక కార్యక్రమాలతోపాటు రైతులను సన్మానించుకుంటామని తెలిపారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు నరాలశెట్టి ప్రకాశరరావు, జోగి రాజా, మండే విజయ్‌కుమార్, కొట్రా లక్ష్మీనారాయణ, అడే చందు, మేడిబోయిన బ్రహ్మారెడ్డి ఉన్నారు.



సంక్రాంతి సంబరాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోన రఘుపతి

'పది'లో నూరుశాతమే లక్ష్యం కావాలి

డీఈఓ పీవీజే రామారావు

చెరుకుపల్లి: ప్రతి పాఠశాలలో పదో తరగతిలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిని సబ్జెక్టుల వారీగా మెరుగుపరచి నూరుశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా హెచ్‌ఎంలు కృషి చెయ్యాలని బాపట్ల జిల్లా విద్యాశాఖ అధికారి పీవీజే రామారావు సూచించారు. మండలంలోని గుళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాపట్ల డివిజన్ లోని ఎంఈఓలు, హెచ్‌ఎంలతో బుధవారం సమావేశం నిర్వహించారు. సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ విషయ నిపుణులతో అన్ని సబ్జెక్టులకు సంబంధించిన విషయాల్లో పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చెయ్యటం కోసం తగిన ప్రణాళిక రూపకల్పన చేశామన్నారు. అదేవిధంగా ప్రతి పాఠశాల పరిధిలో బడిఈడు పిల్లలను గుర్తించి ఉపాధ్యాయులు పాఠశాలల్లో చేర్పించాలన్నారు. మరి ముఖ్యంగా ప్రభుత్వం విద్యార్థుల కోసం ప్రతిష్టాత్మకంగా చేపట్టి అమలు చేస్తున్న జగనన్న విద్యాకానుక పంపిణీ కి రాబోవు విద్యా సంవత్సరానికి సన్నద్ధం కావాలన్నారు, అనంతరం నాడు–నేడు పనులు జరుగుతున్న పాఠశాలల్లో జరుగుతున్న పనులపై ఆయా పాఠశాలల వారీగా ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు, ఇంజినీరింగ్ అసిస్టెంటులను అడిగి తెలుసుకున్నారు. ఎంఈఓలు టి.నవీన్ కుమార్, పులి లాజర్, కె.సురేష్, కె.లక్ష్మీనారాయణ, సీహెచ్ రవి కాంత్, యు.వెంకటేశ్వరరావు, కె.హరిబాబు, తో పాటు పలువురు ఎంఈఓలు, హెచ్‌ఎంలు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.



బాపట్ల డివిజన్ ఎంఈఓలు, హెచ్‌ఎంలతో మాట్లాడుతున్న డీఈఓ రామారావు

సంక్షిప్త వార్తలు

16న నరసింహస్వామి తెప్పోత్సవం

పిట్టలవానిపాలెం: మండలంలోని అల్లూరు గ్రామంలో వేంచేసి ఉన్న రాజ్యలక్ష్మీ సమేత లక్ష్మీనరసింహ స్వామి వారి దేవాలయంలో ధనుర్మాస ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. ప్రతి రోజూ గోదాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి గ్రామోత్సవం నిర్వహిస్తున్నారు. ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ వాలివెంకట శివారెడ్డి మాట్లాడుతూ స్వామివారి దేవాలయంలో డిసెంబర్ 15 నుంచి ధనుర్మాస ఉత్సవాలు అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈనెల 16వ తేదీన స్వామివారి తెప్పోత్సవాన్ని నిజాంపట్నం–తెనాలి పంటకాలువలో అల్లూరు రెడ్లపాలెం నుంచి నిజాంపట్నం లాకుల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ముగిసిన శ్రీరామ నామస్మరణ కోటి మహోత్సవాలు

అద్దేపల్లి(భట్టిప్రోలు): భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లిలోని రామ నామక్షేత్రంలో ఈ నెల 7వ తేదీ నుంచి నిర్వహిస్తున్న శ్రీరామ నామస్మరణ కోటి మహోత్సవాలు బుధవారం మహా నివేదనతో ముగిశాయి. ఉదయం స్వామి వార్లకు పంచామృతాభిషేకం స్త్రీలు సమష్టిగా నిర్వహించారు. పూజా కార్యక్రమాలను కూరపాటి సుధాకర శాస్త్రి, అద్దేపల్లి శ్రీరామాచార్యులు శాస్త్రయుక్తంగా నిర్వహించారు. కార్యక్రమాలను సంఘ అధ్యక్షుడు కొన్నిపాటి భాస్కరరావు, ఉపాధ్యక్షులు కాగిత దుర్గా ప్రసాద్, సహాయ కార్యదర్శి కాగిత ఆంజనేయులు పర్యవేక్షించారు.

మొక్కజొన్నలో తెగుళ్ల గుర్తింపు

పల్లెకోన(భట్టిప్రోలు): మొక్కజొన్న పంట పొలాల్లో అక్కడక్కడ ఆకులు తెల్లబడి పెరుగుదల నిలిచిపోవడం గమనించినట్లు మండల వ్యవసాయశాఖాధికారి గొల్లపోతు మీరయ్య తెలిపారు. భట్టిప్రోలు మండలం పల్లెకోన గ్రామంలో బుధవారం ఆయన ఆర్బీకే సిబ్బందితో కలసి మొక్కజొన్న పంట పొలాలను సందర్శించారు. దీని నివారణకు ఎకరాకు 19–19–19ని అరకిలో మాంకోజెబ్ లేదా కార్బండైజం 250–300లు గ్రాములు పిచికారీ చేయాలని సూచించారు. పంట ఉరక పరిస్థితుల్లో ఉంటే ఎకరాకు 25 కిలోల యూరియాను వెదజల్లాలని సూచించారు. పల్లెకోన సర్పంచ్ బొల్లెద్దు రాజమ్మ–ప్రతాప్‌కుమార్, ఎంపీటీసీ సభ్యులు దున్నా తిరుపతిబాబు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మండవ రామకోటేశ్వరరావు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఐలవరంలో కూడారై ఉత్సవం

ఐలవరం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం ఐలవరం గ్రామంలో కొలువైన శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానంలో ధనుర్మాసం పురస్కరించుకుని 27వ రోజు కూడారై ఉత్సవం ఘనంగా నిర్వహించారు. దేవాలయ ప్రధాన అర్చకుడు దీవి రఘునాథ చక్రవర్తి మాట్లాడుతూ 27 నక్షత్రాలకు సంకేతమైన పర్వదినమని తెలిపారు. గ్రామ ప్రజలు స్వామి వార్లకు హారతులు పట్టి దివ్య నీరాజనాలు పలికారు. కార్యక్రమంలో ఎస్‌ఎస్‌ఎఫ్ మండల కన్వీనర్ పడమట వెంకటేశ్వరరావు, బాపట్ల జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమ శంకరరావు, నగర సంకీర్తన సంఘం కన్వీనర్ కేవీవీ రమణ, ఫణిదపు నాగులు, జి.జగన్‌మోహన్‌రావు, వి.కోటేశ్వరరావు పాల్గొన్నారు.

రేపు ముగ్గుల పోటీలు

భట్టిప్రోలు: భట్టిప్రోలు వాసవి క్లబ్, సంతూర్ కంపెనీల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంక్రాంతి సంబరాల్లో భాగంగా వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో ఈనెల 13వ తేదీన ముగ్గుల పోటీలు నిర్వహించనున్నట్లు క్లబ్ నిర్వాహకులు నాగళ్ల ఆంజనేయులు నంబూరి లక్ష్మీపవన్ కుమార్, నంబూరు బాలాజీ నాగ వరప్రసాద్‌లు బుధవారం తెలిపారు. అదేవిధంగా అద్దేపల్లి–భట్టిప్రోలు పద్మశాలీయ బహుత్తమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీన మధ్యాహ్నం 3 గంటలకు మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బుధవారం తెలిపారు. వివరాలకు 91544 92701 నంబరులో సంప్రదించాలని కోరారు.

సుస్థిర సేంద్రియ వ్యవసాయంతో అధిక దిగుబడులు : డీపీఎం వాణిశ్రీ

పిట్టలవానిపాలెం: సుస్థిర సేంద్రియ వ్యవసాయంతో నాణ్యమైన అధిక దిగుబడులు పొందవచ్చని డీపీఎం వాణిశ్రీ తెలిపారు. మండలంలోని ఖాజీపాలెంలో డాక్టర్ వైఎస్సార్ క్లస్టర్ పొలంబడిలో భాగంగా మూడు రోజుల కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ 20 నుంచి 25 రోజుల మధ్య కాలంలో మినుము పంటపై ఆకుతినే పురుగు ఉన్నందున దీని నివారణకు సుస్థిర సేంద్రియ పద్ధతిలో బ్రహ్మాస్త్రంను తయారు చేస్తున్నామని తెలిపారు. అదేవిధంగా మినుము పంట ఆరోగ్యకరంగా పెరిగేందుకు ద్రవజీవామృతం వాడే విధానాన్ని రైతులకు సూచించారు. ఏఈఓ సుదర్శనరావు, వీఏఏలు ఉన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

నగరం: స్నేహపూర్వక వాతావరణానికి క్రీడలు దోహదపడతాయని గ్రామ సర్పంచి చింతల పవన్ కుమార్ చెప్పారు. మండలంలోని ఈదుపల్లి గ్రామంలో సంక్రాంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను బుధవారం సర్పంచి ప్రారంభించి మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలలోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 17వతేదీ వరకు పోటీలు జరుగుతాయన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కర్లపాలెం: రోడ్డు ప్రమాదంలో గాయాలపాలై చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. యాజలి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నేత, ఆర్యవైశ్య నాయకుడు నందిపాటి సుబ్బారావు గుంటూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతిచెందాడని కర్లపాలెం ఏఎస్‌ఐ సాంబశివరావు బుధవారం తెలిపారు. ఈనెల 3వ తేదీన సుబ్బారావు యాజలి సెంటర్ నుంచి కర్లపాలెం వైపు మోపెడ్‌పై వెళుతుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొనటంతో తీవ్రంగా గాయపడి గుంటూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతిచెందారని సాంబశివరావు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

చెరుకుపల్లి: గూడవల్లి మునిస్వామి నాయుడు స్మారక ఉన్నత పాఠశాలలో 1978–79 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమావేశం మొదటి రోజు ఘనంగా న్విహించారు. ఆ నాడు కలసి చదువుకున్న వారు వివిధ ప్రాంతాల్లో, దేశాల్లో ఉద్యోగాలు చేస్తున్న, మరియు స్వగ్రామాల్లో వివిధ రకాల వృత్తులు, వ్యవసాయం చేసుకుంటున్న 102మంది పూర్వ విద్యార్థులు 40 సంవత్సరాల తరువాత కలుసుకుని గత స్మృతులు నెమరువేసుకున్నారు. పాఠశాల ఆవరణలో ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుని కుటుంబ యోగక్షేమాలు తెలుసుకున్నారు. అనంతరం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం రెండో రోజు పాఠశాలలో చదువు చెప్పిన ఉపాధ్యాయులను సత్కరించనున్నట్లు నిర్వహకులు తెలిపారు.

దళారుల మాటలు నమ్మిమోసపోవద్దు

బాపట్ల: ధాన్యం రైతులు దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని ఎమ్మెల్యే కోన రఘుపతి సూచించారు. బుధవారం స్థానిక కోన నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. రైతులు దళారులను నమ్మకుండా నేరుగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతుభరోసా కేంద్రాలను సంప్రదించాలని సూచించారు. సివిల్ సప్లయ్ అధికారుల సూచనల మేరకు ఆర్బీకేల ద్వారా ధాన్యాన్ని విక్రయించుకోవటం వలన మద్దతు ధర లభిస్తుందని సూచించారు. దళారులు, కొంతమంది రైస్‌మిల్లర్స్ ఆగడాలను అరికట్టేందుకు ఆర్బీకేలు పని చేస్తాయని చెప్పారు. కొంతమంది రైతులు తమ ధాన్యం రేపల్లె, వేమూరు ప్రాంతాలకు చెందిన రైస్‌మిల్లులకు కేటాయించటం వలన ఇబ్బందులు పడుతున్నామని చెప్పారన్నారు. బాడుగ, మద్దతు ధరను ప్రభుత్వం ఇస్తునప్పుడు నేరుగా మిల్లులు వద్దకు తీసుకుని ధాన్యం విక్రయించుకోవటంలో ఎందుకు ఇబ్బంది పడుతున్నారో అర్థం కావటంలేదన్నారు. రైతుభరోసా ఏర్పాటును ఇతర రాష్ట్రాలు కూడా ఆదర్శంగా తీసుకుంటున్నాయని చెప్పారు. రైతులు లబ్ధిపొందాలనే అంతిమ లక్ష్యంగా ప్రభుత్వం ఈకార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు.ఆర్బీకేలు తేమ శాతం నిర్ణయిస్తే రైస్‌మిల్లర్స్ తేమశాతం పెంచుతున్నారని చెప్పటం సరికాదని చెప్పారు. రైతుపక్షపాత ప్రభుత్వంలో రైతులు ధైర్యంగా ఉండాలని సూచించారు. ధాన్యం విక్రయాలపై వెంటనే బిల్లులు కూడా జమ జరుగుతున్నాయని చెప్పారు. కొంతమంది దళారులు చేసే ప్రచారాన్ని నమ్మొద్దని సూచించారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు నరాలశెట్టి ప్రకాశరరావు, జోగి రాజా, మండే విజయకుమార్ ఉన్నారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఏకగ్రీవం

భట్టిప్రోలు: యూటీఎఫ్ భట్టిప్రోలు మండల శాఖ కార్యవర్గం ఎన్నిక బుధవారం భట్టిప్రోలులోని యూటీఎఫ్ మండల శాఖా కార్యాలయంలో బాపట్ల జిల్లా అధ్యక్షుడు జె. వినయ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగింది. అధ్యక్షుడిగా వి. సురేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఎం. శ్రీనివాసరావు, గౌరవాధ్యక్షుడిగా కె.లక్ష్మీన్నారాయణ, సహ అధ్యక్షులుగా వీవీ ప్రతాప్, ఎం.కృష్ణప్రియ, ఆర్థిక కార్యదర్శిగా టి.శ్రీనివాస్, కార్యదర్శులుగా మగ్బూల్‌భాషా, టి.శ్రీధర్, ఒ.రోజా రమణి, బి.రాంబాబు, ఎస్‌ఎ ఇమామ్, జిల్లా ప్రతినిధులుగా బి. ఏకాంబ్రాచారి, టి. శ్రీనివాసరెడ్డి, ఎండీ అబ్దుల్ అయూబ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.